సాక్షి ప్రకాశం

ఆదివారం । 16 । ఫిబ్రవరి । 2025



కుంటుతున్న కూటమి వైద్యం

కూటమి ప్రభుత్వ తీరుతో మార్కాపురం గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో స్పెషలిస్టులు లేక, మెరుగైన వైద్య సేవలు అందక రోగులు అల్లాడుతున్నారు.

- 8లో..



నీటి కుంటలో పడి మహిళ మృతి

పశువుల మేతకు వెళ్లి నీటికుంటలో పడి మహిళ మృతిచెందిన సంఘటన కొనకనమిట్ల మండలం యర్రగుంట్ల గ్రామంలో జరిగింది.

- 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
34/23

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగమంచు కురుస్తుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

బర్డ్ ఫ్లూతో అప్రమత్తంగా ఉండాలి

- పౌల్ట్రీ ఫామ్స్‌ను తనిఖీ చేసిన జేడీ కే బేబిరాణి



ఈతముక్కలలో పౌల్ట్రీ ఫామ్స్‌ను తనిఖీ చేస్తున్న పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ కె.బేబిరాణి

కొత్తపట్నం: కోళ్లకు వచ్చే బర్డ్ ఫ్లూపై అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కె.బేబిరాణి అన్నారు. మండలంలోని ఈతముక్కల గ్రామంలో ఉన్న పౌల్ట్రీ ఫామ్స్‌ను శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా యజమానులతో మాట్లాడుతూ కోళ్ల మరణాలపై ముందు జాగ్రత్త చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలని కోరారు. పక్షుల అసహజ మరణాలు నమోద వుతున్న నేపథ్యంలో ప్రజలకు స్థానిక పశుసంవర్ధక శాఖ వారికి తెలియజేయాలన్నారు. సందేహాస్పదంగా చనిపోయిన పక్షులను ముట్టుకోకూడదని వివరించారు. వాటిని తినకూడదని, దూరంగా పూడ్చిపెట్టాలని తెలిపారు. వ్యాధి సోకినట్టుగా అనుమానమున్న పక్షులను వేరు చేయాలని, తగిన పరీక్షలు చేయించాలని తెలిపారు. పౌల్ట్రీ ఫామ్‌లో పనిచేసేవారు చేతులు సబ్బుతో కడుక్కోవడం, ముఖానికి మాస్క్ ధరించడం తప్పనిసరిగా చేయాలన్నారు. పశుసంవర్ధక శాఖ సలహా తీసుకుని అవసరమైన టీకాలు వేయించాలన్నారు. అస్వస్థత, జ్వరం, శ్వాస సమస్యలు ఉన్నవారు వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. స్థానికంగా రైతులతో మాట్లాడుతూ బాగా ఉడికించిన కోడి మాంసం, కోడి గుడ్లుని తినవచ్చున్నారు. ఎలాంటి అపోహలకు లోనవ్వకూడదని వివరించారు. కార్యక్రమంలో కొత్తపట్నం పశువైద్యాధికారిని టి.అనూషా, రైతులు ఉన్నారు.



బర్డ్ ఫ్లూ ప్రభావం.. చికెన్ పేరెత్తితేనే జనం బెంబేలెత్తుతున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు ఎలాంటి కేసులు వెలుగు చూడనప్పటికీ ప్రజలు మాత్రం చికెన్ తినాలంటే చాలు వణికిపోతున్నారు. ముక్క లేకుండా ముద్ద దిగని వారు సైతం వెనుకంజ వేస్తున్నారు. చివరికి కోడిగుడ్డు తినాలంటే కూడా ఒకటికి రెండు సార్లు ఆలోచించే పరిస్థితి. ఫలితంగా చికెన్ ధరలు పతనమయ్యాయి. పట్టణాలు, గ్రామాల్లో అమ్మకాలు భారీగా పడిపోయాయి. దీంతో పౌల్ట్రీ వ్యాపారులు మాత్రం అల్లాడిపోతున్నారు.

కోడి తల వాల్చి.. వ్యాపారాలు కూల్చి

పడిపోయిన గుడ్ల అమ్మకాలు..

బర్డ్ ఫ్లూ ప్రభావం కోడిగుడ్డు మీద కూడా పడింది. ఒంగోలు నగరంలో కోడిగుడ్లను విక్రయించే హోల్‌సేల్ దుకాణాలు 10 కి పైగా ఉన్నాయి. ఇక రిటైల్ వ్యాపారుల లెక్కలేదు. కోడిగుడ్ల దుకాణాలతో పాటుగా చిల్లర దుకాణాలు, కూరగాయల దుకాణాల్లో కూడా కోడిగుడ్లను విక్రయిస్తుంటారు. జిల్లాలో రోజుకు లక్ష కోడి గుడ్ల వరకు అమ్ముతుంటారని వ్యాపారులు చెబుతున్నారు. అలాంటిది ఇప్పుడు 35 వేల నుంచి 40 వేల వరకు కూడా విక్రయాలు జరగడం లేదని వాపోతున్నారు.

- చికెన్ తినాలంటే వణికిపోతున్న ప్రజలు
- జిల్లాలో 70 శాతం వరకు తగ్గిన విక్రయాలు
- తీరం వెంబడి డిసెంబర్, జనవరిలోనే చనిపోయిన కోళ్లు
- గుడ్ల విక్రయాలపైనా ప్రభావం
- అల్లాడిపోతున్న పౌల్ట్రీ వ్యాపారులు
- జిల్లాలో పశు సంవర్ధక శాఖ అధికారుల మొద్దు నిద్ర

ఒంగోలు టౌన్: జిల్లాలో పౌల్ట్రీని ఒక పెద్ద పరిశ్రమగా చెప్పవచ్చు. స్నేహ, అభ్యుదయ, జీవీఆర్ తదితర కంపెనీలతో పాటుగా స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో కోళ్ల ఫారాలు నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 12 నుంచి 15 లక్షల కోళ్లను పెంచుతున్నట్లు సమాచారం. ఒంగోలు నగరంలో 150 చికెన్ దుకాణాలు ఉండగా ఆదివారం మరో 50 దుకాణాల వరకు రోడ్డు పక్కన, వీధుల్లో పెట్టుకొని చికెన్ విక్రయిస్తుంటారు. జిల్లాలో 800 నుంచి 1000 చికెన్ దుకాణాలు ఉన్నాయి. ఒక్కో దుకాణంలో కనీసం సరాసరిన 200 కేజీల చికెన్ విక్రయాలు జరుగుతాయి. పేరున్న దుకాణాల్లో రోజుకు 200 కిలోల నుంచి 400 కిలోల చికెన్ విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఆదివారం వస్తే దాదాపుగా అన్నీ దుకాణాలు కిటకిటలాడుతుంటాయి. పెద్ద దుకాణాల్లో 500 కిలోల చికెన్ విక్రయాలు జరుగుతుంటాయని సమాచారం. కిలో చికెన్ ధర ప్రస్తుతం రూ.180 నుంచి రూ.230 వరకు ఉంది. పశ్చిమ ప్రకాశం జిల్లాలోని కంభంలో రూ.150 నుంచి రూ.180 కు మాత్రమే చికెన్ అమ్మకాలు జరుగుతున్నాయి. తీర ప్రాంతంలోని సింగరాయకొండ, కొండపి లాంటి చోట్ల కూడా దీని ప్రభావం కనిపించింది.

70 శాతానికి పైగా తగ్గిన చికెన్ అమ్మకాలు...

ఎప్పుడైతే గోదావరి జిల్లాలో పెద్ద సంఖ్యలో కోళ్లు చనిపోతున్నట్లుగా వార్తలు రావడం మొదలైందో అప్పటి నుంచే చికెన్ అమ్మకాలు క్రమంగా పడిపోతూ వచ్చాయి. సోషల్ మీడియాలో చికెన్ తినవద్దంటూ జరిగిన ప్రచారం మరింత ప్రభావం చూపింది. అత్యధిక శాతం ప్రజలు చికెన్ తినడం మానేశారు. దీంతో 60 నుంచి 70 శాతం వరకు చికెన్ విక్రయాలు తగ్గిపోయాయని తెలుస్తోంది. బిర్యానీ హోటళ్లపై కూడా ప్రభావం పడింది. దీంతో రోజుకు 100 కిలోలు చికెన్ తీసుకొని పోయే హోటళ్లు కూడా ఇప్పుడు 25 నుంచి 35 కిలోల వరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం నగరంలో కానీ జిల్లాలో కానీ చికెన్ దుకాణాలు ఖాళీగా బోసిపోతున్నాయి. దీంతో చికెన్ దుకాణాల వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు.

డిసెంబరు నుంచే కోళ్ల వైరస్...

నిజానికి జిల్లాలో గత ఏడాది డిసెంబరు నుంచే వైరస్ ప్రభావం కనిపించినట్లు పౌల్ట్రీ రైతులు చెబుతున్నారు. ప్రధానంగా తీర ప్రాంతంలో ఈ ప్రభావం ఎక్కువగా ఉంది. తీర ప్రాంతంలో నాటు కోళ్ల పెంపకం ఎక్కువగా ఉంటుంది. అదికూడా పందెం కోళ్లను పెంచి విక్రయిస్తుంటారు. ఒక్కో కోడిని రూ.5 వేల నుంచి రూ.15 వేల వరకు విక్రయిస్తారు. వీరిలో చాలా మంది ఈ పరిస్థితిని ముందుగా ఊహించి అప్రమత్తమై కొంచెం ముందుగానే కోళ్లను విక్రయించినట్లు సమాచారం. మిగిలిన రైతులు మాత్రం ఆర్థికంగా బాగా నష్టపోయారు. ఒక్కొక్కరు రూ.3 నుంచి రూ.5 లక్షల వరకు నష్టపోయినట్లు తెలుస్తోంది. అంతేకాదు డిసెంబర్, జనవరి నెలల్లో నాటు కోళ్లు సైతం ఎక్కువగా చనిపోయినట్లు సమాచారం. నాటు కోళ్లను పెంచిన వారు రూ.50 వేల నుంచి రూ.3 లక్షల వరకు నష్టపోయినట్లు తెలుస్తోంది. ఇదే పరిస్థితి కొనసాగితే పౌల్ట్రీ పరిశ్రమ ఇప్పట్లో కోలుకోవడం కష్టమైపోతుందని అంటున్నారు. ఇదిలా ఉండగా పేపర్ రేటు రూ.110 ఉంటేనే పౌల్ట్రీ రైతులకు లాభం ఉంటుంది. ప్రస్తుతం రూ.90 మాత్రమే ఉంది. పేపర్ రేటుకు రూ.25 తక్కువకు హోల్‌సేల్ వ్యాపారులు కోళ్లను కొనుగోలు చేస్తుంటారని, దీంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పశు సంవర్ధక శాఖ అధికారుల మొద్దునిద్ర

ఇరుగు పొరుగు జిల్లాల్లో బర్డ్ ఫ్లూ వ్యాధి సోకి లక్షల కోళ్లు మృత్యువాత పడుతుంటే, జిల్లాలో బర్డ్ ఫ్లూ భయంతో ప్రజలు చికెన్, కోడిగుడ్లు తినడానికి జంకుతుంటే పశు సంవర్ధక శాఖ అధికారుల్లో ఎలాంటి చలనం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలో ఇప్పటి వరకు బర్డ్ ఫ్లూ వైరస్ లక్షణాలు కనిపించక పోయినప్పటికీ ప్రజలను అప్రమత్తం చేయడంలో ఆ శాఖ మొద్దు నిద్రపోతోందని పౌల్ట్రీ రైతులు ధ్వజమెత్తుతున్నారు. జిల్లా పరిస్థితిని ప్రజలకు వివరించి చెప్పడం, జిల్లాలోని పౌల్ట్రీ రైతులకు, కోళ్ల పెంపకందారులకు జాగ్రత్తలు తెలియజేస్తూ ప్రచార మాధ్యమాల ద్వారా పెద్ద ఎత్తున ప్రచారం చేయడం లాంటివి చేయలేదు. దాంతో పౌల్ట్రీ పరిశ్రమపై కోలుకోని దెబ్బ పడిందని, పశు సంవర్ధక శాఖ అధికారులు ప్రజలను చైతన్యం చేసి ఉంటే ఈ దుస్థితి దాపురించేది కాదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


మన జిల్లాలో బర్డ్ ఫ్లూ వైరస్ ప్రభావం లేదు



మన జిల్లాలో ఎక్కడా బర్డ్ ఫ్లూ లక్షణాలు లేవు. గోదావరి జిల్లాలో కూడా ఒక పరిమిత ప్రాంతంలో మాత్రమే బర్డ్ ఫ్లూ లక్షణాలు కనిపించాయి. అయినప్పటికీ సోషల్ మీడియాలో విపరీతమైన దుష్ప్రచారం జరుగుతోంది. ప్రజల్లో భయాందోళనలు కలిగేలా ప్రచారం చేస్తున్నారు. దాంతో నాలుగు రోజులుగా చికెన్ అమ్మకాలు బాగా తగ్గిపోయాయి. వెంటనే ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి. ప్రజల్లో అపోహలు తొలగించేందుకు ప్రచారం నిర్వహించాలి.

– ఎస్ఎస్ సైదా, చికెన్ దుకాణం నిర్వాహకుడు

పౌల్ట్రీ పరిశ్రమను ఆదుకోవాలి



బర్డ్ ఫ్లూ పుకార్లతో జిల్లాలోని పౌల్ట్రీ పరిశ్రమ తీవ్రంగా నష్టపోయింది. నాలుగు రోజుల నుంచి సగానికి సగం వ్యాపారం తగ్గిపోయింది. కోళ్లే కాకుండా కోడి గుడ్డు తినడానికి కూడా ప్రజలు బెంబేలు పడుతున్నారంటే ఏ స్థాయిలో ప్రచారం జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. ఇదే పరిస్థితి కొనసాగితే పౌల్ట్రీ పరిశ్రమ కోలుకోవడం కష్టం. ఇప్పటికి జరిగిన నష్టం చాలు. ఇకనైనా ప్రభుత్వం నష్ట నివారణ చర్యలు తీసుకోవాలి.

– ఎనుగంటి రమేష్, పౌల్ట్రీ యజమాని

ప్రతి రైతుకూ విశిష్ట సంఖ్య



సంతనూతలపాడు మండలం పి.తక్కెళ్లపాడులో రైతు సేవా కేంద్రంలో రైతులకు ఫార్మర్ యూనిక్ ఐడీ నమోదు చేస్తున్న అగ్రికల్చర్ సిబ్బంది



ఫార్మర్ యూనిక్ ఐడీపై అవగాహన కల్పిస్తున్న ఏఓ జక్కం మెర్సీ

- సంక్షేమ పథకాల అమలుకు ఇదే ప్రామాణికం
- సొంతభూమి ఉన్నవారే అర్హులు
- కొనసాగుతున్న ప్రక్రియ

బేస్తవారిపేట/సంతనూతలపాడు: కేంద్ర ప్రభుత్వం ఆధార్ తరహాలో రైతులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించేందుకు చర్యలు చేపట్టింది. సాగు భూమి ఉన్న ప్రతీ రైతుకు 14 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్య పత్రం జారీ చేసే ప్రక్రియను చేపట్టింది. భవిష్యత్‌లో వివిధ సంక్షేమ పథకాల అమలుకు ఈ విశిష్ట సంఖ్య ప్రామాణికం కానుంది. ప్రస్తుతం రైతు సేవా కేంద్రాల్లో ఫార్మర్ యూనిక్ ఐడీ నమోదు ప్రక్రియ నిర్వహిస్తున్నారు. జిల్లాలో 4,70,352 మంది రైతులు ఉన్నారు. దాదాపు 600 మంది వ్యవసాయశాఖ, రైతు సేవా కేంద్రం సిబ్బందితో నమోదు చేస్తున్నారు.

యూనిక్ ఐడీ ప్రయోజనాలు:

ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, వ్యవసాయ పరికరాలు, ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను పొందడానికి ఈ నంబర్ అధికారిక గుర్తింపుగా పనిచేస్తుంది. పీఎం కిసాన్ చెల్లింపులు, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, సబ్సిడీపై వ్యవసాయ యాంత్రీకరణలో పరికరాలు, సూక్ష్మ పోషకాలు, సూక్ష్మ సేద్యంపై రాయితీ, పంట రుణాలు, పెట్టుబడి సాయం వంటి పథకాలకు నేరుగా పొందే వీలు కలుగుతుంది. సత్వర పరిహారం పొందేందుకు ఉపయోగపడుతుంది. నీటి పారుదల, తెగుళ్ల నియంత్రణ, వాతావరణ సూచనలు వంటి ఇతర సేవలు అందుకోవడానికి దోహదపడుతుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. వరి, వేరుశనగ, పత్తి, మిర్చి, మినుము, మొక్కజొన్నలతో పాటు కూరగాయలు, ఇతరత్రా ఎటువంటి పంటలను సాగు చేసినా, ఒక్క సెంటైనా వ్యవసాయ భూమి ఉన్న రైతులకు ఐడీ నంబరు అవసరం.

నమోదుకు అవసరమైన ధ్రువపత్రాలు..

రైతు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్ లేదా వన్‌బీ, ఆధార్‌కు లింకు అయిన మొబైల్ నంబర్. వీటిని ఆన్‌లైన్‌లో పొందుపర్చడం ద్వారా రైతు మొబైల్ నంబర్‌కు మూడుసార్లు ఓటీపీలు వస్తాయి. ఆ ఓటీపీలను వ్యవసాయ సిబ్బందికి తెలియజేసి రైతు విశిష్ట గుర్తింపు ప్రక్రియ దరఖాస్తును పూర్తి చేయాలి. సొంత పొలం ఉన్న రైతులంతా అధికారులు సూచించిన ధ్రువ పత్రాలతో స్థానిక రైతు సహాయ కేంద్రాల్లో సంప్రదిస్తే నమోదు చేసుకుంటారు.

ప్రతి రైతు చేయించుకోవాలి

రైతు సేవా కేంద్రాల్లో ఫార్మర్ యూనిక్ ఐడీ నమోదు చేస్తున్నాం. ఈ విశిష్ట సంఖ్యను ప్రతి రైతు పొందాల్సిన అవసరం ఉంది. భవిష్యత్‌లో ఎటువంటి పథకాలు అమలు కావాలన్నా ఇది తప్పనిసరి అవుతుంది.

– డీ బాలాజీనాయక్, ఏడీఏ, గిద్దలూరు.

దివ్యాంగుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

ఒంగోలు వన్‌టౌన్: దివ్యాంగుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం ఉండకూడదని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అన్నారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం శనివారం ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 60 మంది దివ్యాంగులు వారి సమస్యలపై అర్జీలు ఇచ్చారని, వాటిని తక్షణం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు సంయుక్త కలెక్టర్ ఆర్ గోపాల కృష్ణ, దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జీ అర్చన తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమ శాఖ సిబ్బందిపై గ్రీవెన్సులో ఫిర్యాదు

దివ్యాంగుల సంక్షేమ శాఖ సిబ్బంది సీనియర్ అసిస్టెంట్, వసతి గృహం వార్డెన్‌గా బాధ్యతలు చూస్తున్న జూనియర్ అసిస్టెంట్‌పై గ్రీవెన్స్‌లో దివ్యాంగుల సంఘం నాయకుడు ఎస్‌డీ అమీర్ హంజా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సీనియర్ అసిస్టెంట్ వసతి గృహంలోని విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడన్నారు. మరో పది రోజుల్లో పరీక్షలు సమీపిస్తున్నా సమయానికి విద్యార్థులకు ఆహారం అందించడంలేదని, ట్యూటర్‌లు లేరని చెప్పారు. దివ్యాంగుల యూనిక్ ఐడెంటిటీ కార్డులను దివ్యాంగులకు పంపిణీ చేయకుండా కొంత కాలంగా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో ఎం సులోచనారాణి, ఎస్‌కె కాలేషా, పీ రాజేష్, పీ బానోతు, వెంకటేశ్వరరావు, రసూల్ తదితరులు ఉన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

- జిల్లాలో 15 వేల ఇంకుడు గుంతలు నిర్మించాలని లక్ష్యం
- మంత్రి స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా



ఇంకుడు గుంతల పనులను ప్రారంభిస్తున్న మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా

కొండపి: పరిసరాల పరిశుభ్రత తో పాటు వ్యక్తిగత పరిశుభ్రతకి ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి స్వామి అన్నారు. మండలంలోని జార్లపాలెంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాతో కలిసి ఆయన పాల్గొన్నారు. ముందుగా స్థానికులు, విద్యార్థులతో కలిసి నిర్వహించిన అవగాహన ర్యాలీలో వారు పాల్గొన్నారు. అనంతరం ఇంకుడు గుంతల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంతో పాటు ఇంకుడుగుంతల నిర్మాణానికి కూడా ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా శనివారం ఇంకుడు గుంతలను నిర్మించే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఈ క్రమంలో మన జిల్లాలో కూడా సుమారు 15 వేల ఇంకుడు గుంతలను నిర్మించాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. జార్లపాలెం గ్రామంలో 150 ఇంకుడు గుంతలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ ఇంకుడుగుంతల ఆవశ్యకతపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు. తడి చెత్త, పొడి చెత్తను ఇంటి వద్ద ప్రజలు వేరు చేసేలా అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. బాల్య వివాహాలు చేయకుండా కనీసం ప్రతి ఆడబిడ్డ డిగ్రీ చదివేలా చూడాలని ఈ సందర్భంగా కలెక్టర్ పిలుపునిచ్చారు. పరిసరాల పరిశుభ్రత పనుల్లో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి మంత్రి, కలెక్టర్ స్వయంగా పాల్గొన్నారు. మంత్రి, కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. రెండు డ్వాక్రా సంఘాలకు రూ.3 లక్షల చొప్పున మంజూరైన రుణాలను సందర్భంగా లబ్ధిదారులకు మంత్రి, కలెక్టర్ అందించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కె.లక్ష్మీ ప్రసన్న, డీపీవో వెంకట నాయుడు, డ్వామా పీడీ జోసఫ్ కుమార్, జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అర్జున్ నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్.ఈ.బాల శంకర్ రావు, డివిజనల్ పంచాయతీ అధికారి పద్మ, స్థానిక మండల అభివృద్ధి అధికారి రామాంజనేయులు, తహసీల్దార్ మురళి, ఇతర అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

వ్యర్థాల నిర్వహణతో పర్యావరణానికి మేలు



వ్యర్థాల నిర్వహణపై స్కిట్ ప్రదర్శిస్తున్న నర్సింగ్ విద్యార్థులు

ఒంగోలు టౌన్: వ్యర్థాల నిర్వహణ వలన పర్యావరణానికి మేలు జరుగుతుందని జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ కె.అద్దయ్య చెప్పారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా శనివారం జీజీహెచ్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీజీహెచ్‌లో క్రమం తప్పకుండా వ్యర్థాల నిర్వహణ జరుగుతుందని తెలిపారు. కలర్ కోడెడ్‌లో పేర్కొన్న ప్రకారం వ్యర్థాల సేకరణ చేయడం వలన వాటి నిర్వహణా సామర్థ్యాన్ని పెంచుకోవచ్చని సూచించారు. తడి చెత్త, పొడి చెత్త నిర్వహణ గురించి డిప్యూటీ సూపరింటెండెంట్ డా. నామినేని కిరణ్ వివరించారు. ఈ సందర్భంగా ఇంటిలో, ఇంటి పరిసరాల్లో వ్యర్థాల నిర్వహణ సరిగా చేయకపోవడం వలన కలిగే నష్టాలు, కష్టాలను వివరిస్తూ నర్సింగ్ విద్యార్థులు ప్రదర్శించిన స్కిట్ ఆకట్టుకుంది. అనంతరం నర్సింగ్ విద్యార్థులు, శానిటరీ సిబ్బంది, జీజీహెచ్ సిబ్బంది చేత స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర గురించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ డా.మాధవీలత, డిప్యూటీ ఆర్ఎంఓ డా.చెంచయ్య, సైకియాట్రిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.సాగర్, రిసోర్స్ పర్సన్స్ సౌజన్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా పద్ధతులు పాటించాలి

- జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల ముగింపు



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు వన్‌టౌన్: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా పద్ధతులను పాటించాలని కలెక్టర్ ఎ తమీమ్ అన్సారియా అన్నారు. ఒంగోలు రవాణాశాఖ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల ముగింపు సభలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా నిర్లక్ష్యం, ఓవర్ కాన్ఫిడెన్సు కారణంగా జరుగుతున్నాయన్నారు. ప్రతి నెలా రహదారి భద్రతా కమిటీ సమావేశం నిర్వహిస్తారని, ఈ సమావేశంలో నిర్ణయించిన అంశాలు అమలు చేస్తారన్నారు. శాఖాపరమైన నిర్లక్ష్యం కారణంగా జిల్లాలో ఎక్కడా రోడ్డు ప్రమాదాలు జరుగకూడదన్నారు. ప్రజల్లో మార్పు రావాలన్నారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ వేగం కంటే ప్రాణం ఎంతో విలువైందని ఆ ప్రాణం కూడా మన చేతుల్లోనే ఉందన్నారు. వాహనాలు నడిపే సమయంలో ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆటో డ్రైవర్లు జాగ్రత్తగా నడిపి ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. కార్యక్రమంలో రవాణా శాఖ ఉప కమిషనర్ సుశీల, ఆర్అండ్‌బీ, నేషనల్ హైవే శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

‘చలో కర్నూలు’ను మాలలు జయప్రదం చేయాలి

ఒంగోలు వన్‌టౌన్: చలో కర్నూలు కార్యక్రమాన్ని మాలలు జయప్రదం చేయాలని మాల మహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు అన్నారు. ఒంగోలు బీఎస్ఎన్ఎల్ సేవా కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కులగణన, ఎంపరికల్ డేటా లేకుండా, ఎస్సీలను వర్గీకరణ చేసే హక్కు చంద్రబాబుకు లేదన్నారు. గతంలో కూడా చంద్రబాబు మాలలను అణగదొక్కాలని ఎస్సీ వర్గీకరణ చేసి అభాసు పాలయ్యాడన్నారు. అసెంబ్లీలో ఎస్సీ వర్గీకణ బిల్లు పెడితే చంద్రబాబు రాజకీయానికి మాలలు చరమ గీతం పాడతారన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈనెల 23న కర్నూలులో భారీ బహిరంగ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చప్పిడి వెంగళరావు, సంపత్ కుమార్, యెరిచర్ల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మల్లెల వెంకట్రావు

క్లుప్తంగా

వృద్ధురాలు ఆత్మహత్య

జరుగుమల్లి (సింగరాయకొండ): జరుగుమల్లి మండలం వావిలేటిపాడు గ్రామానికి చెందిన వృద్ధురాలు గవదగట్ల సుబ్బమ్మ (79) శనివారం పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. వయసురీత్యా అనారోగ్య కారణంగా ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు తెలిపారని ఎస్సై బి.మహేంద్ర వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కి తరలించినట్లు చెప్పారు.

జిల్లా జైలు ఆధ్వర్యంలో 'స్వచ్ఛ ఆంధ్ర'



స్వచ్ఛ ర్యాలీ నిర్వహిస్తున్న జిల్లా జైలు అధికారులు, సిబ్బంది

ఒంగోలు టౌన్: పర్యావరణ పరిరక్షణ, ప్రజల ఆరోగ్యానికి కారణమయ్యే పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛత గురించి ప్రజలంతా అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా జైలు సూపరింటెండెంట్ పి.వరుణారెడ్డి కోరారు. శనివారం జిల్లా జైలు ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. స్థానిక చర్చి సెంటర్ నుంచి ర్యాలీ సందర్భంగా వరుణారెడ్డి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యతని అన్నారు. సగం వ్యాధులు అపరిశుభ్రత కారణంగానే వస్తాయని తెలిపారు. అనంతరం జైలు ఆవరణ, టాయిలెట్లను శుభ్రం చేయడం గురించి ఖైదీలకు అవగాహన కల్పించారు. జైలు ఆవరణలో తడి చెత్త, పొడి చెత్తను వేరువేరు రంగుల డబ్బాలలో వేసేందుకు ఏర్పాట్లు చేశారు. జైలులోని ఖైదీలకు, సందర్శకులకు తాగేందుకు మంచినీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జిల్లా సబ్ జైళ్ల అధికారి మహమ్మద్ ఇర్ఫాన్, వైద్యాధికారి బ్రహ్మతేజ, జైలర్ శ్రీనివాసరావు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

- మార్కాపురం జీజీహెచ్‌లో వైద్య నిపుణులు కరువు
- బదిలీ అయిన వారి స్థానంలో కొత్తవారిని నియమించని కూటమి ప్రభుత్వం
- స్పెషలిస్టులు లేక రోగులకు అందని మెరుగైన వైద్యసేవలు
- రోజురోజుకూ తగ్గుతున్న ఓపీలు
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రోజుకు 750 నుంచి 800 మధ్య ఓపీలు
- ప్రస్తుతం 400 నుంచి 450కి పడిపోయిన సంఖ్య
- నాణ్యమైన వైద్యమందక అల్లాడుతున్న పశ్చిమ ప్రకాశం ప్రజలు



మార్కాపురం జీజీహెచ్‌లో ఖాళీగా ఉన్న బెడ్లు

కుంటుతున్న కూటమి వైద్యం..!

మార్కాపురం: ప్రభుత్వ వైద్యరంగాన్ని కూటమి సర్కార్ పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోంది. కనీసం బదిలీ చేసిన డాక్టర్ల స్థానంలో కొత్తవారిని కూడా నియమించకుండా అలసత్వం ప్రదర్శిస్తోంది. కూటమి ప్రభుత్వ తీరుతో మార్కాపురంలోని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ (జీజీహెచ్)లో స్పెషలిస్టులు లేక.. మెరుగైన వైద్యసేవలు అందక పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైద్య నిపుణుల సేవల కోసం ఒంగోలు, గుంటూరు, కర్నూలు, హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్తున్నారు.

జీజీహెచ్‌గా అప్‌గ్రేడ్ చేసి 80 మంది వైద్యులను నియమించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం...

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మార్కాపురంలో మెడికల్ కాలేజీ నిర్మాణంతో పాటు స్థానిక ప్రభుత్వ వైద్యశాలను జిల్లా స్థాయి గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ (జీజీహెచ్)గా అప్‌గ్రేడ్ చేశారు. సుమారు 80 మంది వైద్యులు, స్పెషలిస్టు డాక్టర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించి పశ్చిమ ప్రకాశం ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రభుత్వ వైద్య రంగంపై కక్ష కట్టింది. మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని నిలిపివేసింది. పీపీపీ విధానంలో ఏర్పాటు చేస్తామని చెప్పినప్పటికీ ఆ దిశగా కూడా ఇంతవరకూ అడుగులు పడలేదు. అంతేగాకుండా మార్కాపురం జీజీహెచ్‌లో పనిచేస్తున్న సుమారు 40 మందికిపైగా వైద్యులను ఒంగోలు, గుంటూరు, విజయవాడ, రాజమండ్రి, శ్రీకాకుళం, ఏలూరు, కర్నూలు తదితర వైద్య కళాశాలలకు, వైద్యశాలలకు బదిలీ చేసింది. వీరి బదిలీలు పూర్తయి రెండు నెలలు దాటినా నేటికీ వారిస్థానాల్లో కొత్తవారిని నియమించలేదు. దీంతో జీజీహెచ్‌లో 2019కి ముందు పరిస్థితులు నెలకొన్నాయి.

సగానికి పడిపోయిన ఓపీల సంఖ్య...

కూటమి ప్రభుత్వ తీరుతో పశ్చిమ ప్రకాశం ప్రజలకు ఉచిత నాణ్యమైన కార్పొరేట్ వైద్యం పూర్తిగా దూరమైంది. మార్కాపురం జీజీహెచ్‌లో సగానికి పైగా పడిపోయిన రోజువారీ ఓపీల సంఖ్యే అందుకు నిదర్శనంగా ఉంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రూ.475 కోట్లతో మార్కాపురం మండలం రాయవరం వద్ద మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని తలపెట్టారు. సుమారు 75 శాతం పనులు పూర్తి చేశారు. మార్కాపురం వైద్యశాలను జీజీహెచ్‌గా మార్చివేసి 80 మందికిపైగా వైద్యులను నియమించారు. వీరిలో వివిధ విభాగాలకు చెందిన స్పెషలిస్టు వైద్యులు కూడా ఉన్నారు. దీంతో 2019 వరకూ రోజుకు 150 నుంచి 200 ఓపీలే ఉండగా, మెడికల్ కాలేజీ ఏర్పాటు, స్పెషలిస్టు డాక్టర్ల నియామకంతో వాటి సంఖ్య 750 నుంచి 800కు పెరిగాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గత మూడు నెలల వ్యవధిలోనే మార్కాపురం జీజీహెచ్‌లో పనిచేస్తున్న 40 మందికిపైగా వైద్యులు బదిలీపై వెళ్లిపోయారు. ఫలితంగా జీజీహెచ్ స్థాయి తగ్గిపోవడంతో పాటు వైద్యుల కొరత కూడా ఏర్పడింది. స్పెషలిస్టు వైద్యులు లేకపోవడంతో ఓపీల సంఖ్య క్రమంగా తగ్గిపోతోంది. ప్రస్తుతం 400 నుంచి 450కి ఓపీల సంఖ్య పడిపోయింది. ఇప్పటి వరకూ మార్కాపురం జీజీహెచ్‌లో వైద్యసేవలు పొందిన కర్నూలు జిల్లా శ్రీశైలం, సున్నిపెంటతో పాటు పశ్చిమ ప్రకాశంలోని పుల్లలచెరువు, యర్రగొండపాలెం, గిద్దలూరు, రాచర్ల, కొమరోలు, పొదిలి, కనిగిరి ప్రాంతాల రోగులు స్పెషలిస్టు వైద్యులు లేకపోవడంతో ఒంగోలు, ఇతర నగరాలకు వెళ్తూ అవస్థపడుతున్నారు.

ఒకేసారి 26 మంది వైద్యుల బదిలీ...

మార్కాపురం జీజీహెచ్‌లో పనిచేస్తున్న 26 మంది డాక్టర్లను గత నవంబర్ నెలలో ఒకేసారి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు కూటమి ప్రభుత్వం బదిలీ చేయడంతో వారంతా రిలీవ్ అయ్యారు. డాక్టర్లు ఎస్.సుబ్బారెడ్డి, తిరుపతిరెడ్డి, ఖాజామొహిద్దీన్, వి.సునీత, లక్ష్మీకిరణ్, రామలింగమ్మ, పీవీ ప్రసాద్, కేవీ భారతి, పి.లత, సయ్యద్ అబ్దుల్ వాజీద్, మోహన్‌రాజు, హేమ, సంగీత, ఎస్‌కే మస్తాన్‌వలి, సుష్మ, నాగప్రసాద్, కె.ప్రవంతి, కేశవచంద్ర, వాసవీ, ప్రసాద్‌బాబు, విన్నీ డియార, వంశీకృష్ణ, అనిరుధ్, వెంకటేశ్వర్లు, రామారావు, రమ్యశ్రీ తదితరులు బదిలీపై వెళ్లారు. వీరి స్థానాల్లో నూతనంగా ఎవరినీ నియమించలేదు. దీంతో వైద్యశాలలోని ఆయా విభాగాలలో వైద్యసేవలు నత్తనడకన సాగుతున్నాయి. రోగుల సంఖ్య కూడా క్రమంగా తగ్గుతోంది.

పడకలన్నీ ఖాళీ...

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెనుకబడిన పశ్చిమ ప్రకాశం ప్రజలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించడంతో పాటు ఏకంగా మెడికల్ కాలేజీ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. జిల్లాకు రెండో మెడికల్ కాలేజీ మంజూరు చేసి మార్కాపురం జిల్లా వైద్యశాలను జీజీహెచ్‌గా అప్‌గ్రేడ్ చేసి 100 పడకలను 500 పడకలకు పెంచారు. 150 మెడికల్ సీట్లను భర్తీ చేయాలని లక్ష్యంగా పెట్టుకుని అందుకు అనుగుణంగా ఏర్పాట్లు పూర్తి చేశారు. కానీ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని పూర్తిగా పక్కన పెట్టి జీజీహెచ్‌లోని వైద్యులను బదిలీ చేసింది. కళాశాల ప్రిన్సిపాల్‌ను నెల్లూరుకు, జీజీహెచ్ సూపరింటెండెంట్ ఏలూరుకు బదిలీ చేశారు. దీంతో ఓపీలు, రోగుల సంఖ్య తగ్గిపోయి మార్కాపురం జీజీహెచ్‌లోని పడకలన్నీ ఖాళీగా కనిపిస్తున్నాయి.



మార్కాపురం జీజీహెచ్

వైద్య నిపుణులను నియమించాలి



మార్కాపురం జీజీహెచ్‌లో స్పెషలిస్టు వైద్యులను నియమించాలి. మెడికల్ కళాశాల నిర్మాణాన్ని ప్రభుత్వమే చేపట్టాలి. ఈ విషయమై ప్రజాసంఘాలతో కలిసి సీపీఐ, సీపీఎం పోరాటం ప్రారంభించాయి. స్పెషలిస్టు వైద్యులు లేకపోవడంతో ఓపీల సంఖ్య సగానికి తగ్గిపోయింది. పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం దూరమవుతోంది. ప్రభుత్వం మెడికల్ కళాశాల నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలి. ఉచితంగా నాణ్యమైన వైద్యాన్ని ప్రజలకు అందించాలి.

– సోమయ్య, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

వెలిగండ్ల (హనుమంతునిపాడు): ఉరేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన వెలిగండ్ల మండలం పద్మాపురంలో శనివారం ఉదయం వెలుగు చూసింది. పామూరు సీఐ భీమానాయక్, ఎస్సై మధుసూదన్‌రావులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. పోలీసుల కథనం ప్రకారం.. నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలేనికి చెందిన ఏనుగు ప్రతాప్‌రెడ్డి (35) స్థానికంగా ఎన్‌హెచ్ పనుల వద్ద సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి భార్య ఫాతిమా, పిల్లలు ఉన్నారు. శుక్రవారం రాత్రి దంపతుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో తెల్లవారిన తర్వాత ప్రతాప్‌రెడ్డి ఉరికి వేలాడుతూ నిర్జీవంగా కనిపించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధుడి మృతదేహం గుర్తింపు



దేవసహాయం (ఫైల్)

కనిగిరి రూరల్ (హనుమంతునిపాడు): కనిగిరి కొండ అయ్యప్ప స్వామి గుడి వద్ద ముళ్ల పొదల్లో వృద్ధుడి మృతదేహాన్ని స్థానికులు శనివారం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం గుర్తు పట్టేందుకు వీల్లేని స్థితిలో కుళ్లి ఉంది. ఎస్సై మాధవరావు కథనం ప్రకారం.. అయ్యప్ప స్వామి గుడి వద్ద ముళ్లపొదల్లో మృతదేహం ఉంది. వీఆర్వో నివేదిక ఆధారంగా కనిగిరి పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. సోషల్ మీడియాలో మృతదేహం వైరల్ కావడంతో బంధువులు గుర్తించారు. మృతుడు వెల్పుల దేవసహాయం (72)గా స్పష్టమైంది. పొదిలి పట్టణం బాప్టిస్టుపాలెంగా నిర్ధారించినట్లు సీఐ ఖాజావలి, ఎస్సై ఎం.మాధవరావు తెలిపారు.

కంగారు మదర్ కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



జీజీహెచ్‌లో గైనిక్ వార్డును పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు టౌన్: స్థానిక జీజీహెచ్‌లో కంగారు మదర్ కేర్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. శనివారం జీజీహెచ్‌ని సందర్శించి గైనిక్ విభాగాన్ని పరిశీలించారు. గైనిక్ వార్డులో మరమ్మతులకు సంబంధించిన పనులను పరిశీలించారు. వాష్ రూంలో టైల్స్ మార్చాలని సూచించారు. ఇతర అనుబంధ వార్డులను తనిఖీ చేశారు. బ్రాండింగ్, బెడ్లు, ఇతర అవసరమైన సదుపాయాలను వెంటనే ఏర్పాటు చేయాలని చెప్పారు. కనిగిరిలో ఇప్పటికే కంగారు మదర్‌ను ప్రారంభించామన్నారు. ఒంగోలు జీజీహెచ్‌లో కూడా సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేసి సెంటర్‌ను ప్రారంభించాలన్న ఉద్దేశంతో ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట అడ్మినిస్ట్రేటర్ అద్దయ్య, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్, గైనిక్ హెచ్‌ఓడీ డాక్టర్ సంధ్యారాణి, చీమకుర్తి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఆర్ఎంఓ డాక్టర్ మాధవీలత, డీసీహెచ్ఎస్ డాక్టర్ సూరిబాబు, నర్సింగ్ సూపరింటెండెంట్ సంపూర్ణమ్మ, ఎన్టీఆర్ వైద్య సేవల ట్రస్ట్ కో ఆర్డినేటర్ డాక్టర్ హేమంత్, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ చెంచయ్య తదితరులు ఉన్నారు.

విభిన్న ప్రతిభావంతుల హక్కుల చట్టం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు వన్‌టౌన్: విభిన్న ప్రతిభావంతుల హక్కుల చట్టం–2016 పోస్టర్‌ను కలెక్టర్ తమీమ్ అన్సారియా శనివారం ఆవిష్కరించారు. ఎంఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోస్టర్‌లను రూపొందించి దివ్యాంగులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా తమ ఫౌండేషన్ ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాలను థామస్ జిల్లా కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ గోపాలకృష్ణ, దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జి.అర్చన, ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

నీటి కుంటలో పడి మహిళ మృతి



వెంకటమ్మ మృతదేహం

కొమరోలు: నీటి కుంటలో పడి మహిళ మృతిచెందిన సంఘటన మండలంలోని యర్రగుంట్ల గ్రామంలో శుక్రవారం జరగ్గా.. శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన నారు వెంకటమ్మ (69) రోజులాగే శుక్రవారం తన పశువులను మేతకు తోలుకెళ్లింది. సాయంత్రమైనా తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు యర్రగుంట్ల గ్రామ పరిసర ప్రాంతాల్లో గాలించారు. శనివారం తెల్లవారుజామున గ్రామ సమీపంలోని ఓ నీటికుంటలో వెంకటమ్మ మృతదేహం తేలుతూ కనిపించింది. పశువులు నీటి కుంటలో దిగి రాకపోవడంతో వెంకటమ్మ వాటిని అదమాయించే క్రమంలో జారి కుంటలో పడి మృతిచెంది ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. వెంకటమ్మ కుమారుడు నారుబ్రహ్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతురాలికి భర్త, ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

గుప్త నిధుల కోసమే హత్య చేశారా?



శ్యామ్ ప్రసాద్ ఇంటి వద్ద విచారిస్తున్న పోలీసులు

కంభం: పట్టణంలో శుక్రవారం కలకలం రేపిన కదం శ్యామ్‌ప్రసాద్ హత్య కేసులో మద్యానికి బానిసై వావి వరుసలు మరిచి అసభ్యంగా ప్రవరిస్తూ వేధిస్తుండటాన్ని తట్టుకోలేని తల్లి, ఇద్దరు కుమారులు.. ఓ ఆటో డ్రైవర్‌తో కలిసి కన్నకొడుకును చంపినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఇంటికి ఆనుకొని వారి ఖాళీ స్థలంలో శ్యామ్ ప్రసాద్‌ను హతమార్చి మృతదేహాన్ని అక్కడే 8 ముక్కలుగా చేసి మూడు బస్తాల్లో వేసి సమీపంలో ఉన్న ఇరిగేషన్ కాలువ గట్టు వెంట పడేసినట్లు తెలిసింది. ఇంటి పక్కన ఉన్న ఖాళీ స్థలంలో గుప్త నిధులున్నాయని, వాటి కోసమే శ్యామ్ ప్రసాద్‌ను హత్య చేసి ఉంటారని వార్తలు వినిపిస్తున్నాయి. అందుకోసమే కాలనీకి చెందిన ఆటో డ్రైవర్‌కు సుపారీ ఇచ్చినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. చెడువ్యసనాలకు బానిసై అసభ్యంగా ప్రవర్తిస్తున్న కొడుకును హత్య చేసిన అనంతరం అంతదారుణంగా ముక్కలు చేయడం చూస్తుంటే హత్య వెనుక మరొక కోణం కూడా దాగి ఉందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంటి పక్కన ఉన్న ఖాళీ స్థలం, అప్పులు తీర్చేందుకు ఇంటిని అమ్మాలని ఓ కొడుకు ప్రయత్నిస్తుంటే శ్యామ్ ప్రసాద్ అడ్డుకోవడం కూడా ఒక కారణం కావచ్చని స్థానికంగా వినిపిస్తున్న మాటలు. పోలీసుల విచారణలో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పోక్సో, ఎస్సీ ఎస్టీ కేసు నమోదు

మద్దిపాడు: స్థానిక పోలీసుస్టేషన్ పరిధిలో శనివారం పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒంగోలు నేతాజీ కాలనీకి చెందిన మాగంటి గోపి పుల్కా పాయింట్లో పనిచేస్తూ సంవత్సరం క్రితం ఒక బాలికను మాయమాటలతో లోబర్చుకున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 9వ తేదీన ఆ బాలికను తీసుకెళ్లిపోయాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి వారి సెల్‌ఫోన్ డేటా ఆధారంగా వారిని కృష్ణా జిల్లా నూజివీడులో గుర్తించి శుక్రవారం ఉదయం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో వారిని పోలీసులు విచారించారు. బాలికను శారీరకంగా వేధించినట్లు నిర్ధారించారు. దళిత బాలికను ఈ విధంగా చేయడంతో పాటు తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ చట్టం, పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అన్నా క్యాంటీన్ ఆకస్మిక తనిఖీ



అన్నా క్యాంటీన్‌లో ఆహారాన్ని పరిశీలిస్తున్న డైరెక్టర్ సంపత్‌కుమార్

ఒంగోలు వన్‌టౌన్: నగరంలోని అన్నా క్యాంటీన్‌ను ఏపీ సీడీఎంఏ మున్సిపల్‌శాఖ కమిషనర్, డైరెక్టర్ ఐఏఎస్ సంపత్‌కుమార్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయం పక్కనున్న అన్నా క్యాంటీన్‌లో ఉదయం అల్పాహార నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. క్యాంటీన్ సిబ్బందితో మాట్లాడుతూ జీతాలు సమయానికి అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అల్పాహారం తింటున్న వారితో మాట్లాడి నాణ్యతపై ఆరా తీశారు. ఆయన వెంట నగరపాలక సంస్థ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు ఉన్నారు.

న్యాయవాది ఇంటి వద్ద ఆగంతకుల రెక్కీ



సీసీ టీవీ ఫుటేజ్

ఒంగోలు టౌన్ : నగరంలో న్యాయవాది ఇంటిపై గుర్తు తెలియని మహిళ.. మరో యువకుడితో కలిసి రెక్కీ నిర్వహించడం సంచలనం సృష్టించింది. నగరానికి చెందిన ప్రముఖ న్యాయవాది పొదిలి శ్రీనివాసులు జక్రయ్య హాస్పటల్ ఎదురుగా ఉన్న రామాలయం వీధిలో కుటుంబంతో కలిసి నివసిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం 5 గంటల సమయంలో కోర్టు పనుల కోసం ఆయన బయటకు వెళ్లారు. ఆ సమయంలో ఒక మహిళ.. 20 ఏళ్ల యువకుడితో కలిసి ఇంటి వద్ద రెక్కీ నిర్వహించారు. బయట గేటుకు లోపల నుంచి గడియ పెట్టి ఉండటంతో తీసేందుకు ప్రయత్నించారు. గేటు తీసుకొని వెళ్లిన వారికి ఇంటి తలుపులు వేసి ఉండటం కనిపించింది. దీంతో వెనుదిరిగిపోయారు. కొద్ది సేపటికే తిరిగి ఇంటి వద్దకు వచ్చి లోపలకు వెళ్లేందుకు ప్రయత్నించారు. శ్రీనివాసరావు భార్య గురువారం రాత్రి మహాకుంభమేళాకు వెళ్లారు. కూతురు నెల్లూరులో లా చదువుతోంది. ఇంటి మీద ఉన్న డాబాలో ఆయన కుమారుడు సాయి కార్తికేయ చదువుకుంటున్నాడు. కింద ఏదో అలికిడి కావడంతో సాయి కార్తికేయ బయటకు వచ్చి చూడగా ఆగంతకులు ఇద్దరూ పారిపోయారు. వెంటనే సమాచారం తెలుసుకున్న శ్రీనివాసరావు ఇంటికి చేరుకొని ఇంట్లో ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించారు. ఈ విషయంపై ఒన్‌టౌన్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఏఆర్ దామోదర్, డీఎస్పీ ఆర్.శ్రీనివాస రావుకు సీసీ పుటేజీ పంపించారు. సీఐ నాగరాజు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మెడవిరుపు వ్యాధితో దూడలు మృతి



దూడ కళేబరం

కురిచేడు: మండలంలోని దేకనకొండలో మెడవిరుపు వ్యాధి సోకి దూడలు మృతి చెందుతున్నాయి. వారం రోజుల వ్యవధిలో మూడు దూడలు మృతి చెందినట్లు గ్రామస్తుడు ఏసుబాబు తెలిపారు. రెండు, మూడు నెలల దూడలు పాలు తాగి పడుకుని వెంటనే మెడ వెనక్కి పెట్టి మృత్యువాత పడుతున్నాయని పశుపోషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సచివాలయం ఆహేలు చూడటం లేదని, కనీసం పశువైద్యులకు కూడా సమాచారం ఇవ్వడం లేదని, గ్రామంలో ఉన్న దూడలకు మెడవిరుపు వ్యాధి సోకకుండా చికిత్స చేయాలని పశుపోషకులు కోరుతున్నారు.